నాగరాజు నవ్వి, “ఇరవై ఏళ్లబట్టి నాటకాలు వేస్తూ మీకింత అమాయకమేవిటండీ బాబూ, వాడనేది ఏవిటంటే లతకు నాటకంకంటే మంచి గిరాకీ తగిలుంటుంది అని.”

“తగిలుండటం ఏవిటి? తగిలింది. మధుబాబు కొత్త సమాజం పెట్టాడు. కొత్త నాటకం రిహార్సల్స్ చేస్తున్నాడు, రసికుడు. భార్య జబ్బుతో హాస్పిటల్లో వుంది. చేతినిండా డబ్బుంది. అందుబాటులో లత వుంది. ఇంకా చెప్పాలంటే...” అంటూ ఏదో చెప్పబోతున్న చిట్టిబాబు మాటలకు శర్మాజీ అడ్డు తగిలి,

“ఏవిటయ్యా ఆ మాటలు? మనతో కలిసి నటించే ఓ అమ్మాయి గురించి అలా మాట్లాడటం తప్పుకాదూ...? అసలు నన్ను అడిగితే యిక్కడ లేని మనిషిని గురించి చెడు మాట్లాడటం చాలా చెడ్డ అలవాటు. లత ఆలాటిది కాదు,” అన్నాడు.

సరిగ్గా అదే సమయానికి ఆ హాలులోకి అడుగు పెట్టబోయి తన గురించే ఏదో మాట్లాడుకుంటున్నారని గ్రహించి వినాలన్న కుతూహలంతో బయటే ఆగిపోయింది లత. పొంచి వుండి వింటోంది!

సన్ని వేశాలే చేద్దాం. ప్రారంభించండి” అన్నాడు శర్మాజీ.

“లత మీకు నటిగానే తెల్సు సార్! కాని ఆమె చాలా తెలివైంది. మీరు రంగస్థలాన్ని దేవాలయంగా భావిస్తారు. ఆమె షోరూమ్‌గా భావిస్తుంది... వయసులో వుంది. దీపం వుండగానే యిల్లు చక్క





*చింతపెంట సత్యనారాయణరావు (సిఎస్ రావు) కథారచయితగా లబ్ధప్రతిష్టులు. విరసం సభ్యులు. 'ఇప్పుడు వీస్తున్న గాలి' (ప్రభుత్వం నిషేధించింది) లో వారి కథ చోటు చేసుకుంది.*

*తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామంలో 1935 డిసెంబరు 20న జన్మించిన ఆయన వృత్తిపరంగా లెక్చరర్ అయినప్పటికీ రచయితగా 80 కథలు, 18 నవలలతోపాటు పలు రేడియో నాటికలు, వేదిక నాటకాలు రాశారు.*

*ఆయన రాసిన కథలు అన్నీ అయన అనుభవం లోనుంచి వచ్చినవే. వారి కుటుంబీకులు కరణీకం వృత్తిలో ఉండడం వలన పల్లెల్లోని రాజకీయాలు ఆయనకి బాగా తెలుసు. వీరి రచనలు ఊరుమ్మడి బతుకులు, కమలమ్మ కమతం చలనచిత్రాలుగా రూపొందాయి. ప్రాణంఖరీదు, కుక్క కాటుకు చెప్పుదెబ్బ, తరం మారింది, నాయకుడు వినాయకుడు, మల్లెమొగ్గలు, యజ్ఞం, దీక్ష వంటి చిత్రాలకు కథలు, మాటలు అందించారు. 'ఊరుమ్మడి బతుకులు' సినిమాకు జాతీయ అవార్డు కూడా వచ్చింది. సరదా రాముడు, సొమ్మొకడిది సోకొకడిది, మట్టిమనుషులు వంటి చిత్రాల్లో, పలు నాటకాల్లో నటించారు సీఎస్ రావు. నాటకరంగానికి విశేష మైన సేవ చేసి ఎన్నో అవార్డులని సైతం గెలుచుకున్నారు. పలువురు నటీనటులకు నటనలో శిక్షణ ఇచ్చి, మంచి గురువుగా పేరు తెచ్చుకున్నా రాయన.*

*'ఊరుమ్మడి బతుకులు' కథ గురించి కొడవటిగంటి కుటుంబరావు 'సీతను ఎత్తుకెళ్లిన రావణుడిని చంపిన రాముడు దేవుడయినప్పుడు, ఈ కథలో తన పెళ్లాన్ని చెరబట్టిన దొరను చంపిన వాడిని హంతకుడని ఎలా అనగలం?' అని తన ముందుమాటలో ప్రశ్నించారు. కనకాల దేవదాసు మద్రాస్‌లో నటులకు శిక్షణ ఇచ్చే సందర్భంలో ఈ నాటకాన్ని టెక్స్ట్‌గా వాడారు.*

*హైదరాబాద్‌లో ఆయనకో సాహితీ మిత్రబృందం ఉండేది- చంద్ర, రాజారామమోహన్‌రావు, డి వెంకట్రామయ్య, చందు సోంబాబు, భైరవయ్య... ప్రతీ ఆదివారం ఎవరో ఒకరి ఇంట్లో కలుసుకుంటూ ఉండేవారు, కథాచర్చలు చేసేవారు.*

*15 ఏప్రిల్ 2020 మంగళవారం నాడు హైదరాబాదులో మరణించిన సిఎస్ రావుగారికి నివాళిగా 1978లో యువ మాసపత్రికవారి చక్రపాణి మొదటి అవార్డును పొందిన కథ 'ప్రశ్న' మీకోసం...*

బెట్టుకుంటోంది,'' అని వ్యాఖ్యానించాడు ప్రకాష్.

''బాగా చెప్పావ్! వెధవది నాటకం వేస్తే కడిగి వంద రూపాయలిస్తారు. నెలరోజులు రిహార్సల్ చెయ్యాలి. మధుబాబులాటి వాడితో ఒకరోజు గడిపితే, నాటకానికి వచ్చే వందా వస్తాయి! రాత్రికి వచ్చే ఆదాయమూ వస్తుంది,'' అన్నాడు తంబు.

''ప్లీజ్ స్టాపిట్! లేవండి రిహార్సల్ చేద్దాం,'' అన్నాడు శర్మాజీ ఆదేశపూర్వకంగా.

అందరూ లేచి నిలబడ్డారు.

''హీరోయిన్ లేకుండా...'' అని నసిగాడు ప్రకాష్.

''ఆమె బదులు డమ్మీగా నేనుంటానయ్యా!'' అని కసురుకున్నాడు శర్మాజీ.

''మీరా! హీరోయిన్ బదులు డమ్మీగా మీరు వుంటారా...? వాడికి ఇన్‌స్పిరేషన్ ఎలా వస్తుంది సార్? వాడామె చెక్కిళ్లు తాకాలి, మీకు గెడ్డముంది,'' అన్నాడు కమెడియన్ తంబు, ప్రకాష్ వంక జాలిగా చూస్తూ.

''సరేనయ్యా, ఆ అమ్మాయిలేని సన్నివేశాలే వేద్దాం, ప్రారంభించండి...'' అన్నాడు శర్మాజీ.

వాళ్ల మాటలన్నీ విన్న లత, ''సారీ సార్, లేటయ్యింది,'' అంటూ రిహార్సల్ హాలులోకి ప్రవేశించింది.

ఆమె పరోక్షంలో ఆమె గురించి చులకనగా మాట్లాడిన నలుగురు నటులు ఆమెను చూడగానే ఎక్కడలేని మర్యాద చేయటం ప్రారంభించారు.

ఒకడు, ''ముందు కాఫీ తాగండి,'' అన్నాడు.

''మొహం నిండా ఆ చెమట ఏవిటి? నడిచి

వచ్చారా...! రిక్షాలో రాకపోయారా?'' మరొకడు.

''ఇప్పుడు కాఫీ ఏవిట్రా? కూల్‌డ్రింకో, హార్లిక్సో తెప్పించండి... ఆవిడ అలిసిపోయినట్టున్నారు,'' అన్నాడు హీరో ప్రకాష్ ,

''ఏం వద్దండీ! మంచినీళ్లు చాలు. లేవండి రిహార్సల్ చేద్దాం!'' అంది లత నవ్వుమొహంతోనే.

రిహార్సల్ ప్రారంభమయ్యింది... దాదాపు ఒక గంటసేపు దాలా పకడ్బందీగా రిహార్సల్స్ జరిగాయ్. హీరో ప్రకాష్ సమాజంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయం గురించీ, పురుషుడు చేసిన తప్పే స్త్రీ చేస్తే సంఘం ఆ పురుషుడిని ఎలా గౌరవిస్తుందో ఆ స్త్రీని ఎంత చిన్నచూపు చూస్తుందో వివరించబడిన సంఘటనలను ప్రకాషూ, లతా కూడా అద్భుతంగా నటించారు. నటనలో చెమ్మగిల్లిన కళ్లను ఒత్తుకుంటూ, ''ఈవేళ కాస్త త్వరగా యింటికి వెళ్లాలండి,'' అంది లత శర్మాజీతో

''అలాగేనమ్మా! రేపు మాత్రం టైముకిరా,'' అన్నాడు శర్మాజీ..

''ఇదేనండి హీరోయిన్స్‌తో ఉన్న యిబ్బంది. రిహార్సల్స్‌కి ఆలస్యంగా వస్తారు. త్వరగా వెళతానంటారు,'' అన్నాడు తంబు.

''ఈవేళ ఒక్క రోజుకేనండి,'' అంది లత.

ఒక్కక్షణం ఏదో ఆలోచించింది. ఓ నిర్ణయానికి వచ్చింది. తోటి నటులను ఉద్దేశించి, ''నాదో చిన్న ప్రశ్నండి. మీకు తోచిన సమాధానాలు యివ్వాలందరూ. శర్మాజీగారు అక్కర్లేదు. వారు పెద్దవారు. వారు చాలా సులువుగా సమాధానం చెప్పగలరు,'' అంది లత.

''అడగండి,'' అన్నాడు ప్రకాష్.

''మీరు అడగాలేకాని ఒక్క ప్రశ్నేం ఖర్మ! వంద ప్రశ్నలయినా వరసగా సమాధానాలు చెబుతాం,'' అన్నాడు తంబు.

''నోటితో చెప్పడంకాదు. నేను ప్రశ్న వేస్తాను. దానికి సమాధానం ఎవరికి తోచింది వారు కాగితం మీద రాయండి. ఎవర్నీ ఎవరూ సలహా అడగకూడదు. అంటే కాపీ కొట్టొద్దు అని,'' అంది లత.

''మేం స్టూడెంట్లము అనుకున్నారా కాపీ కొట్టడానికి. జెంటిల్‌మన్స్, కాగితాలు సప్లయి చేయండి'' అన్నాడు నాగరాజు ఎరుడిలా ముందుకివచ్చి.

ఒక తెల్లకాగితం నాలుగు ముక్కలు వేసి నలుగురికి యిచ్చింది. నలుగురూ ప్రశ్న కోసం ఎదురు చూస్తున్నారు.

''మీకు తెలిసిన పతివ్రతల పేర్లు ఒక్కొక్కరూ రెండేసి రాయండి... ప్రశ్న జాగర్తగా విన్నారుగా! నేనడిగింది మీకు తెలిసిన పతివ్రతల పేర్లు,'' అంది లత.

''ఓస్ యింతేనా,'' అన్నారు నల్గురూ ముక్త కంఠంతో.

''అంతే. పైకి చెప్పకుండా కాగితం మీద రాయండి,'' అంది లత.

ఆ ప్రశ్నలోని అంతరార్థంకోసం శర్మాజీ ఆలోచిస్తున్నాడు. అది మామూలు ప్రశ్న మాత్రం కాదు అనుకున్నాడు. నలుగురు నటులు సమాధానాలు రాశారు.

''చదవనా?'' అన్నాడు హీరో ప్రకాష్.

''చదవండి,'' అంది లత.

''అరుంధతి -- అనసూయ'' అని చదివాడు.

చిన్నగా నవ్వింది లత...

''ఏవిటి అలా నవ్వుతున్నారు ? వీరిద్దరూ పతివ్రతలు కారా?'' అన్నాడు ప్రకాష్.

''కారని అనడానికి నేనెంతటిదాన్ని ?'' అని మాత్రం అంది లత.

''నేను చదువుతానండి, దమయంతి, చంద్రమతి'' అని ఆమె అడక్కుండానే చదివేశాడు నాగరాజు.

లత స్పష్టంగా నవ్వుతూ, ''రాజపత్నుల్ని ఎన్నుకున్నారా,'' అంది.

''వీళ్లిద్దరూ పాప్యులర్ పతివ్రతలేనండి,'' అన్నాడు నాగరాజు.

''అవును! అందుకే వారిమీద కావ్యాలు కూడా రాశారు. తర్వాత ...?'' అంటూ చిట్టిబాబు ముఖంలోకి చూసింది.

''సీతా- సావిత్రీనండి,'' అన్నాడు చిట్టిబాబు.

ఈసారి కాస్త గట్టిగా నవ్విందావిడ. ''ఏవిటి

అలా నవ్వుతారు! పేరుమోసిన పతివ్రతలండి వీళ్లు. ఆలాంటి వాళ్లని మీరెందుకు అనుమానిస్తున్నారో నా కర్థం కావటం లేదు..." అన్నాడు చిట్టిబాబు.

"పతివ్రతల్ని నేనెందుకు అనుమానిస్తానండి బాబు... నేనెక్కడ...? వారెక్కడ...? తంబుగారూ మీరేం రాశారు...?"

"ద్రౌపది, అహల్య..." అని చదివాడు తంబు.

ఈసారి లత విరగబడి నవ్వింది.

"నాకు తెలుసు అయిదుగురు భర్తలున్న ద్రౌపదినీ, ఇంద్రుడిచేత మోసగింపబడిన అహల్యను పతివ్రతలన్నారని నవ్వుతున్నాను."

"కాని వాళ్లిద్దరూ పతివ్రతలమని ప్రూవ్ చేసుకున్నారు. మన పురాణాలు ఘోషిస్తున్నాయ్- పెద్ద వాళ్లు ఒప్పుకున్నారు. మనం కాదంటే గొడవ వస్తుంది కదండి," అన్నాడు తంబు.

"వీరందరూ పతివ్రతలు కారని నేను నవ్వ లేదండి. నేనడిగిన ప్రశ్న మీకు తెలిసిన పతివ్రతల పేర్లు రాయమని. ఈ పతివ్రతలెవ్వరూ మీకు తెలియదు. వీరందరూ మీరు విన్న పతివ్రతలు అందుకు నవ్వొచ్చి నవ్వాను. మీ అమాయకత్వానికి జాలిపడి నవ్వాను. చూడండి! మిమ్మల్ని కన్న తల్లులున్నారు. అగ్నిసాక్షిగా మీరు పెండ్లాడిన భార్యలున్నారు... తోబుట్టువులున్నారు. మీలో కొందరికి మీ రక్తాన్ని పంచుకు పుట్టిన కూతుళ్లున్నారు. వీళ్లెవరూ పతివ్రతలు కారు...? మీ వాళ్ళనే మీరు పరివ్రతలుగా అంగీకరించలేరా..." అంది ఆవేశంగా లత.

నలుగురి నటుల ముఖాలు తెల్లబోయాయి.

లత తెలివికి శర్మాజీ ముగ్ధుడయ్యాడు.

"కన్నతల్లినీ, కట్టుకున్న భార్యనీ, ఒకే కడుపున పుట్టిన తోడబుట్టినదాన్నీ, మీ రక్తాన్ని పంచుకుపట్టిన కన్నకూతుర్ని పతివ్రతలుగా చూపించలేని మీరు-నాలాంటి మీ తోటి నటిని పతివ్రతగా ఎలా గుర్తించ గలరులెండి ? నా గురించి మీరేం మాట్లాడినా బాధ లేదు. వస్తాను," అని లత ఒక్కడుగు వేసి, "అన్నట్లు చెప్పడం మరిచాను! రోజూ నా కూడా రిహార్సల్స్‌కి పదేళ్ల పిల్ల వచ్చేది, మీరందరూ చూశారు... అది నా చెల్లెలు అని చెప్పేదానిని అందరితోటి. అది నా చెల్లెలు కాదు. నా కడుపున పుట్టిన బిడ్డ- పదేళ్ల కూతురు వుందీ అందే నాకు వయసు మళ్లిపోయిందని, హీరోయిన్ వేషం యివ్వడానికి అనుమానిస్తారని ఆలా అబద్ధమాడాను... ఆ పిల్లకి కూడా అబద్ధం ఆడటం నేర్పి అక్కా అని పిలిపించుకున్నాను... ఆ పిల్ల యీవేళ ఉదయం చనిపోయింది. ఆ పిల్ల జన్మకు కారకుడయిన మగవాడు ఉన్నాడు కాని తండ్రిని అని చెప్పుకునే మగవాడు కాడు! అందుకే తల్లినీ, తండ్రినీ నేనే అయ్యాను! దాన్ని పూడ్చిపెట్టాను. అందుకని రిహార్సల్స్‌కి కాస్త ఆలస్యమయింది! వస్తానండి," అని అందరికి నమస్కరించి వెళ్ళిపోయింది ఆత.

ఆ క్షణంలో చెమ్మగిల్లిన శర్మాజీ కళ్లకు, లతలో లత కనపడలేదు!

లతలో నటి కనబడలేదు!!

లతలో స్త్రీ కనబడలేదు!!!

లతలో ఒక అమ్మను చూశాడు.

*యువ మాసపత్రిక, 1978 అక్టోబర్*


## యువత ప్రతిభకి పట్టం

**మన పిల్లలు ఎందరో అనేక రంగాలలో అసాధారణ ప్రతిభా పాటవాలని ప్రదర్శిస్తున్నారు. ఇటువంటి అసాధారణ ప్రతిభావంతులెవరైనా మీకు తెలిస్తే దయచేసి మాకు తెలియచెయ్యండి. తానాపత్రికలో పరిచయం చేద్దాము.**

***Please email to editor@tana.org***



సాహితీ తృణాలు

డా॥ రమేష్ ప్రసాద్ రావెళ్ల

# అల్లసాని పెద్దన
# మనుచరిత్ర




ఆంధ్రసాహిత్యంలో కవిత్రయం వ్రాసిన మహా భారతము ఇతిహాసం తరువాత వచ్చిన సాహిత్యాన్ని పురాణ సాహిత్యం, ప్రబంధ సాహిత్యం అనే రెండు పాయలుగా విభజించవచ్చును. పురాణ సాహిత్యం దైవభక్తి ప్రధానమైనది. ఇవన్నీ సంస్కృతం లోని అష్టాదశ పురాణాలకు అనువాదాలు. మారన వ్రాసిన మార్కండేయ పురాణం, పాల్కురికి సోమన వ్రాసిన బసవపురాణం ఇందుకు ఉదాహరణలు.

పురాణాలు భక్తిరస ప్రధానంగా, ధార్మిక లక్ష్యంతో మత ప్రచారానికి, ప్రాబల్యానికి ఉపయోగ పడితే, ప్రబంధ సాహిత్యం కేవలం సాహిత్యం కోసమే అని చెప్పవచ్చును. వీటికి కూడా సంస్కృత మూలాలు ఉన్నప్పటికీ, తెలుగు ప్రబంధాలు కేవలం ఆంధ్ర సాహిత్య ప్రక్రియ.

ప్రబంధానికి వస్త్వైక్యము, రసపోషణము, వర్ణనా బాహుళ్యము, ప్రస్ఫుటంగా ఉంటాయని ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు నిర్వచించారు. మహా భారతంలోని అసంపూర్ణ అరణ్యపర్వముతో పాటు హరివంశము, నృసింహపురాణము వ్రాసిన ఎఱ్ఱా ప్రగడ (1280-1364 అనిశ్చితం, షుమారు) ప్రథమ ప్రబంధకవియని ఆచార్య పింగళి వ్రాశారు. ఎఱ్ఱనకు ప్రబంధపరమేశ్వరుడనే బిరుదం కూడా ఉన్నది.

ప్రబంధాలకు స్వర్ణయుగం శ్రీకృష్ణదేవరాయల పరిపాలనాకాలం (1509-1529). రాయలవారి కొలువులో ఉన్న అల్లసాని పెద్దన, నంది తిమ్మన, రామరాజభూషణుడు, ధూర్జటి, అయ్యలరాజు రామభద్రుడు, తెనాలి రామకృష్ణుడు ప్రబంధాలు రచించారు.

అల్లసాని పెద్దన (బహుశా 1470-1540, అనిశ్చితం) వ్రాసిన మనుచరిత్ర ఈ వ్యాస విషయం. కవి మారన (1291-1323) వ్రాసిన మార్కండేయ పురాణంలోని స్వారోషిక మనువు చరిత్ర కథను ఆధారంగా తీసుకొని అల్లసాని ఒక బృహత్తర ప్రబంధాన్ని రచించారు. మారన 150 పద్యాలలో వ్రాసిన వృత్తాంతాన్ని అల్లసాని తన వర్ణనలతో (అతి వర్ణనలు, అది మరి ప్రబంధ సూత్రం) 800 పద్యాలతో సమ కూర్చి రమణీయ కావ్యంగా తీర్చిదిద్దారు. ముందు స్థూలంగా కథాపరిచయం.

కాశీపట్టణ ప్రాంతంలోని అరుణాస్పదపురము అనే ఊరులో ప్రవరుడు అనే నిష్ఠాపరుడు భార్యతో, తల్లిదండ్రులతో కుటుంబ జీవనం గడుపుతుంటాడు. ఒకరోజు ఒక సిద్ధుడు ప్రవరుని ఇంటికి వచ్చి, ఆతిథ్యము స్వీకరించి, వెళ్లబోతూ ఒక పాదలేపనము ఇచ్చినాడు. ఆ పసరు కాళ్లకు పూసుకుంటే, తను కోరు

కొన్న ప్రదేశానికి వెళ్లవచ్చునని సిద్ధుడు చెప్పుతాడు. ప్రవరుడు ఆ లేపనాన్ని కాళ్లకు పూసుకొని, హిమాలయ పర్వతాలకు వెళతాడు. పర్వతాలను చూశాక, ఇంటికి వెళ్లాలని కోరుకొంటాడు. కాని ఆ పసరు కరిగిపోవటంతో ఆ శక్తిని కోల్పోయి, విచారంతో తిరుగుతున్నప్పుడు, వరూధిని అనే అప్సరస అతన్ని చూస్తుంది. ప్రవరుని వర్చస్సుని చూసి, మోహంతో అతన్ని రాసక్రీడలకు ఆహ్వానిస్తుంది. ప్రవరుడు తిరస్కరించడంతో, వరూధిని దుఃఖంలో ఉన్నప్పుడు, ఇదంతా చూసిన ఒక గంధర్వుడు ప్రవరుని వేషంలో వచ్చి, ఆ అప్సరసను వశపరచుకుంటాడు.

ఆ మాయాప్రవరుని సంయోగంతో వరూధిని గర్భవతి అయ్యి, పుత్రుడిని కని పెంచుతుంది. ఆ కుమారుడు పేరు స్వరోచి. అతడు పెరిగి, పెద్దయ్యి, ఒక దేశానికి రాజు అవుతాడు. ఒకసారి వేటకు వెళ్లినప్పుడు, మనోరమ అనే యువతిని ఒక రాక్షసుడి నుండి కాపాడి, ఆమెను పెళ్లి చేసుకుంటాడు. మనోరమ కోరికపై ఆమె చెలికత్తెలిద్దరిని కూడా వివాహమాడతాడు. తరువాత ఇంకొకసారి వేటకు వెళ్ళినప్పుడు ఒక వనదేవతను కలిసి, ఆమెను స్వీకరిస్తాడు. వారికి కొడుకు జన్మిస్తాడు. ఆ రాచ కుమారుడు స్వారోచిష మనువుగా పెరిగి, పేరు ప్రతిష్ఠలను పొందుతాడు. ఆ మనువు స్వారోచిష మన్వంతరానికి ఆదిపురుషుడు. ఇదీ క్లుప్తంగా మనుచరిత్ర కథ.

ఇప్పుడు కొన్ని పద్యాలు చదువుతూ కథలోకి వెళ్దాం. ప్రవరుడు కాళ్లకు పూసుకున్న లేపమహిమతో హిమాలయ పర్వతాలకు చేరాడు. అక్కడ పర్వతాలను చూస్తున్నాడు.

చం. *అట జని కాంచె భూమిసురు డంబరచుంబి శిరస్సరజ్ఝరీ*
*పటల ముహుర్ముహు ర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన*
*స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కలాప కలాపి జాలమున్,*
*గటక చర త్కరేణు కర కంపిత సాలము శీత శైలమున్*
(ద్వితీయాశ్వాసము, 3)

ఇది ఎందరికో చిరపరిచితమైన చంపకమాల పద్యం. ఆ ప్రవరుడు అక్కడ ఏమి చూశాడంటే - ఆకాశాన్ని ముద్దిడుతున్న పర్వత శిఖరాల నుండి జారుతున్న సెలయేర్లు చేస్తున్న మ్రోతలు మృదంగ నాద ధ్వనిలో వినిపిస్తుంటే నెమళ్లు పింఛములు విప్పి నృత్యం చేస్తున్నాయి. ఏనుగులు తమ తొండాలతో కదిల్చేసిన చెట్లున్న ఆ చల్లటి పర్వతాలు కనపడుతున్నాయి.

అంబరచుంబి = ఆకాశాన్ని ముద్దిడుతున్న. పెదవులతో ఉచ్చరించే అక్షరాలను ఓష్ఠ్యములు అంటారు. ఉ, ఊ, ప, ఫ, బ, భ, మ అక్షరాలు ఓష్ఠ్యములు. ఇక్కడ సున్నాతో కూడిన ఓష్ఠ్యమయిన 'బ' అక్షరం ( ంబ) వాడటంలో ముద్దు పెట్టుకొంటే వచ్చే శబ్దాన్ని (పైగా రెండుసార్లు, పాఠకులు గమనిస్తారో లేదో అన్నట్లు) సూచించడం కవి చమత్కారం, శబ్దాలంకారం (Onomatopoeia). అంతేకాక, శిఖరాల నుండి సెలయేర్లు, రాళ్లపై బడి కుప్పిగంతులుగా జారుతున్నప్పుడు లయపూర్వక శబ్దాలు చేస్తుంటాయి, అవి మృదంగలయలో ఉన్నాయట. అభంగ, తరంగ, మృదంగ పదాలను వాడి (ఈసారి మూడు సార్లు. పాఠకులారా, గమనించుము), ఆ మృదంగ లయను శబ్దపూర్వకంగా చూపించారు అల్లసాని. మూడవ పాదంలో నెమళ్లు నృత్యం చేస్తున్నాయి, శబ్దం అంతగా ఉండదు. దృశ్యపూర్వకమే. రెండవ పాదంతో పోలిస్తే, ఎంతో నిశ్శబ్దంగా ఉన్నది. సంస్కృత పదాలయినా వత్తులు లేని, మెత్తటి పదాలు, నెమలుల నృత్యాన్ని సూచించుతున్నవి.

'అల్లసాని వాని అల్లిక జిగిబిగి' అనే వాడుక పద సమూహం పెద్దనగారి కవితాశైలి గురించి నాలుగు పదాల్లో చెప్పుతుంది. విశ్వనాథ సత్యనారాయణ అల్లసాని సాహిత్యంపై వ్రాసిన వ్యాసగ్రంథానికి పేరు అదే పెట్టారు. జిగి అంటే తళుకు, బిగి అంటే బిగువు, పటుత్వం. ఈ పద్యంలో సెలయేళ్ల పరుగులో జిగిని చూశాము. పర్వత శిఖరాలు, సెలయేళ్ల జారుడు, నెమలుల నృత్యం, ఏనుగులు కదిలించిన వృక్షాలు లాంటి వివిధ భావాలను అడవిలోంచి తెచ్చుకునే




వంకరటింకర పుల్లలను ఎలా బిగువుగా మోపు కడతావో అలాంటి బిగువుని ఈ పద్యంలో చూశాము.

కేవలం శబ్దాలంకారాలే కాకుండా ఈ పద్యంలో దృశ్యకోణం కూడా ఉన్నది. ప్రవరుడు ముందు శిఖరాగ్రాలపై దృష్టి సారించాడు. పైనుండి జాలువారే సెలయేళ్లను చూస్తూ దృష్టి నిలువుగా క్రిందకు వచ్చింది. ఆ బయళ్లలో ఉన్న నెమళ్లను చూశాడు. తరువాత పర్వతాల మీది చెట్లను తిలకిస్తున్నాడు, అడ్డంగా చూస్తూ, సర్వదిగ్దర్శక దృష్టి (panoramic view) ఇన్ని శబ్ద దృశ్యభావాలను ఈ ఒక్క పద్యంలో కూర్పుట అల్లసాని వాని జిగిబిగి ముద్ర.

ప్రవరుడు ఆ హిమాలయ ప్రకృతి విశేషాలు చూస్తూ, మైమరచిపోతాడు. ఈలోపు సూరీడు పైకొచ్చేస్తాడు. ఇంటికి తిరిగి వెళ్లడానికి సంసిద్ధమవుతాడు. కాని ఆ ఎండకు ప్రవరుని అరికాళ్లకు పూసుకున్న పసరు కరిగిపోవడంతో, ఎంత ప్రయత్నించిననూ ఎగరలేకపోతాడు. ఎవరినైనా సాయం అడుగుదామని చూస్తుంటే ఒక కొండపై ఒక పెద్ద భవనం కనపడినది. అది వరూధిని నివాసగృహం. వీణ వాయిస్తున్న వరూధిని ప్రవరుడు కొండదారిపై పైకి రావడం చూసింది. ఆ సన్నివేశాన్ని ఈ పద్యంలో గుప్పించాడు అల్లసాని.

ఉ. *చూచి ఝుళంఝుళత్ కటకసూచిత వేగ*
*పదారవిందయై*
*లేచి కుచంబులున్ తురుము లేనడు*
*మల్లలనాడ నయ్యెడన్*
*పూచిన యొక్క పోక నునుబోదియజేరి*
*విలోకనప్రభా*
*వీచికలన్ తదీయ పదవీ కలశాంబుధి*
*వెల్లిగొల్పుచున్*
(ద్వితీయాశ్వాసము, 29)

అతన్ని చూసి, ఝుళంఝుళం అని మ్రోగుతున్న అందెలు సూచించెడు వేగంతో చనుదోయి, జడ కొప్పు, లేనడుము అల్లలాడుతుంటే, పరుగెత్తి అక్కడ ఉన్న పోకచెట్టు చాటున చేరినది. తన చూపుల కాంతి తరంగాలతో అతడు వచ్చు త్రోవను పాలసముద్రపు వెల్లువతో కడిగినట్లు చేసినది. ఈ పద్యంలోని భావ చిత్రం పాఠకునికి కళ్లారా కనవస్తుంది. 'ఝుళంఝుళం' ప్రయోగంతో మొదటి రెండు పాదాలలోని లయ, వేగం ప్రస్ఫుటమవుతాయి. పరుగెడుతున్నప్పుడు శరీర భాగాలు అల్లలాడటం కామచిహ్నమట. ఆ దిగుడు త్రోవపై కొండెక్కుతున్న ప్రవరునికి ఆహ్వానసూచికగా పాలు దొంతరుదొంతరులుగా జారుతున్నాయన్న ఊహాచిత్రం ఎంతయో కనసొంపుగానూ, వినసొంపుగానూ ఉన్నది. ఇది దృశ్యప్రాధానమయిన పద్యం.

ప్రవరుడు వరూధినికి తన గోడు వినిపించి ఇంటికి వెళ్లే మార్గం చెప్పమంటాడు. అతనిపై తనకు కలిగిన మోహభావాలు వ్యక్తంచేసి, అక్కడే ఉండిపోరాదా అంటుంది. ప్రవరుడు తనకు బాధ్యతలూ, నియమాలూ ఉన్నాయనీ, తల్లితండ్రులకు సేవలు చేయాలని, భార్యతో దాంపత్యం నిర్వహించాలనీ, పూజాకార్యక్రమాలు కూడా ఉన్నాయని అంటాడు. అప్పుడు వరూధిని ఇలా అంటుంది.

ఉ. ఎక్కడియూరు కాల్నిలువ కింటికిబోయె
దనంచు పల్కె దీ
వక్కట మీ కుటీరనిలయంబులకున్ సరిరాక
పోయెనే
యిక్కడి రత్నకందరము లిక్కడి నందన
చందనోత్కరం
బిక్కడి గాంగసైకతము లిక్కడి యీ లవలీని
కుంజముల్
(ద్వితీయాశ్వాసము, 50)

వారిరువురి సంవాదం కొనసాగుతుంది. వరూధిని రెచ్చిపోతున్నది.

ఉ. నావుడు విన్నబాటు వదనంబున నించుక దోప
పల్కె నో
భావజరూప యిట్టి యెలప్రాయము వైదికకర్మ
నిష్ఫలం
పోవగ నింక భోగములబొందుట యెన్నడు
యజ్ఞకోటులం
బావనులౌటకున్ ఫలము మా కవుగిళ్ల
సుఖించుటే కదా
(ద్వితీయాశ్వాసము, 54)

ఊరికే మాటలతో లాభం లేదనుకొని, వరూధిని ఒక చిట్కా ప్రయోగించినది, ఈ క్రింది విధంగా.

శా. ప్రాంచద్భూషణ బాహుమూలగతితో పాలిండ్లు
పొంగార పై
యంచుల్ మోవగ కౌగిలించి యధరంబాసింప
హా శ్రీహరీ
యంచున్ బ్రాహ్మణు డోరమోమిడి తదీయాం
సద్వయం బంటి పొ
మ్మంచున్ ద్రోచె కలంచునే సతులమాయల్
ధీరచిత్తంబులన్
(ద్వితీయాశ్వాసము, 68)

అందమైన నగలు ధరించి యున్న వరూధిని, పాలిండ్లు పొంగుతుండగా, కుచాగ్రాలు తగిలేటట్లు కౌగిలించి అధరాలపై ముద్దుపెట్టబోయింది. ఆ బ్రాహ్మణుడు 'హా, శ్రీహరీ' అంటూ, పెడమొఖం పెట్టి, వరూధిని భుజాలు తాటి పొమ్మని త్రోసివేసినాడు. స్త్రీల కపటకృత్యాలు దృఢమనస్కుల దగ్గర పనిచేస్తాయా?

ఆ తిరస్కరణతో వరూధిని మనస్సు చివ్వుమన్నది. కోపం పెరిగిపోయింది. ప్రవరుని ఇలా దూషించినది.

ఉ. చేసితి జన్నముల్ తపము చేసితి నంటి దయా
విహీనతన్
చేసిన పుణ్యముల్ ఫలము సెందునె పుణ్యము
లెన్నియేనియున్
చేసినవాని సద్గతియె చేకురు భూతదయార్ద్ర
బుద్ధి కో
భూసురవర్య యింత తలపోయవు నీచదువేల
చెప్పుమా
(ద్వితీయాశ్వాసము, 72)

ప్రవరుడు అక్కడనుండి వెళ్లిపోయాక, వరూధిని తీవ్రవిరహబాధకు గురి అవుతుంది. ఆ విరహబాధలో ఇలా అంటుంది.

ఉ. ఎంత తపంబు సేసి జనియించిన వారొకొ!
మర్త్యభామినుల్
కాంతుఁడవజ్ఞ చేసినను గాయము వాయుదు;
రే నమర్త్యనై
చింతల వంతలం జివికి సిగ్గఱితిన్ మృతి లేని
నాదుచె
ల్వింతయు శూన్యగేహమున కెత్తిన దీపిక
యయ్యె నక్కటా!
(తృతీయాశ్వాసము, 8)

భూమిపై స్త్రీలు ఎంతయో పుణ్యము చేసినారు. ప్రియులు తిరస్కరించిన యెడల శరీరాలను వీడి పోదురు. దేవతా స్త్రీ నయిన నేను దుఃఖావస్థలతో చీకుచెంది సిగ్గుమాలవలసినదే కాని చనిపోలేనుగదా! చావులేని నా సౌందర్యమంతయూ శిధిలమందిరానికి పెట్టిన దీపం అయినది కదా!

చనుఁగప్పు దొలఁగ (తృతీయాశ్వాసము, 31)... సీసపద్యంలో వరూధిని పడే మన్మథ బాధ వర్ణన ఉన్నది. స్థలాభావం వల్ల ఈ పద్యం తాత్పర్యము

మాత్రమే వ్రాస్తున్నాను. వరూధిని మన్మథ బాధలచే ఎంతో విసుగు చెంది, తనువు చాలించ నిశ్చయించి, ఎదురుగాలికి పైట ఎగిరిపోతుంటే తనపైకి వస్తున్న బాణములకు ఎదురు పరుగెత్తుతున్నది. దావాగ్నిలోకి దూకాలను కొని, జుట్టుముడి తీసివేసి, చిగురాకుల పొదలోకి దూకుతుంది, మతిస్థిమితం లేనట్లుగా. బంగారు గాజులను చేతులపైకి ఎగత్రోసి, ఉరి త్రాటిని వెదుకు విధంగా ఒక తీగను లాగుతున్నది. ఏటిలోకి దూకేవిధంగా మొలత్రాటిని బిగియించి, తేట వెన్నెలలోకి చొరబడుతుంది. తేనీగలకు భయ పడకుండా మామిడిచెట్టు చెంతన నిల్చొని పుప్పొడు లతో నిండిన పువ్వుల నెత్తావిని క్రోలుతున్నది.

మన్మథావస్థలో చరమస్థాయి మృతి యట. కవి వరూధిని మరణ ప్రయత్నాలను వర్ణిస్తూ, ఆమెలోని విరహతీవ్రతను తెలుపుతున్నాడు. దేవతా స్త్రీ కావటం తో వరూధినికి మరణం అసాధ్యమనిపైన (తృతీయా శ్వాసము, 8) చెప్పి, ఇచట ఈ ఆత్మహత్యాప్రయత్నా లను వర్ణించుట కవిసమయమైననూ సందర్భోచి తంగా లేదని నా అభిప్రాయం.

వరూదినీప్రవరుల సంవాదం అంతా చాటు నుండి విన్న ఒక గంధర్వుడు ప్రవరుని వేషంలో వచ్చి, తను మనస్సు మార్చుకున్నానని చెప్పి, వరూధినితో సాంగత్యం కోరతాడు. వరూధిని సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బయి, అతనితో సంభోగం చేస్తుంది. రతిక్రీడలో కనులు మూసుకొని ఉండాలని ఆ మాయా ప్రవరుడు షరతు పెట్టటంతో, వరూధిని తనకు జరుగుతున్న మోసాన్ని పసిగట్టలేకపోయింది, ఆ ఉన్మాదోద్రేకాలతో. తన కోరికలు తీరాక, వరూధిని గర్భవతి అయ్యాక, ఆ మాయాప్రవరుడు ఏదో సాకుతో వరూధినిని వదిలి, వెళ్లిపోతాడు.

వరూధిని కుమారుడు స్వరోచి మహారాజు అవుతాడు. శాపగ్రస్తురాలయిన ఒక రాజకన్య మనోరమను అసురుల నుండి కాపాడి, ఆ అందగత్తెను వివాహమాడతాడు. మనోరమ కోరికపై, ఆమె చెలికత్తెలు విభావసి, కళావతులను కూడా పెళ్లాడుతాడు.

ఒక రాజహంస, ఓ చక్రవాక పక్షి ఒక కొలనులో స్నేహితురాండ్రు. స్వారోచిషుడు తన ముగ్గురు భార్య లతో సంతోషంగా ప్రణయ విహారాలు చేస్తుంటే హంస ముచ్చటపడుతోంది. చక్రవాక పక్షికి మాత్రం అది నచ్చదు. అవి రెండూ దాంపత్య జీవనం గురించి చర్చిస్తాయి. ఆ పక్షుల సంవాదంలో ఇది చివరి పద్యం. చక్రవాకి హంసతో ఇట్లు అన్నది.

ఆ. *తగులు నెవ్వఁడొక్క తరుణికి నొకనికి*
*మెలఁత వలచు నదియ మే లనంగ*
*వచ్చుఁ గాని పెక్కు వనితలపైఁ గూర్మి*
*గలుగు ననుట బొంకు గాదె తరుణి!*

(షష్ఠాశ్వాసము, 74)

స్వరోచి ఆ పక్షుల సంవాదం విని, సిగ్గుపడు తాడు. కాని తరువాత ఇంకొక సౌందర్యవతిని చూస్తాడు. ఆ సన్నివేశం పెద్దన ఇలా వర్ణిస్తాడు.

సీ. *నావుడు నమరకాంతాతనూభవుఁ జూచి,*
*యివ్వన దేవత నే నరేంద్ర!*
*సకల భూభువన రక్షాదక్షు మనువర్యు, నీ*
*యందుఁ బడయు నెన్నిక సమస్త*
*దివిజులు నన్నుఁ బ్రార్థించిన వచ్చితి,*
*ననురాగవతి నైన నను వరించి*
*పడయుము నాయం దపత్యంబు దీన నీ,*
*కగుఁ బుణ్యలోక సంప్రాప్తి యనిన*

తే. *నట్ల కా కని యయ్యంబుజాయతాక్షి-*
*నేకచిత్తంబుతోడ నంగీకరించె*
*బాల యిట్లు సుఖాంబుధిఁ దేలుచుండి-*
*యంత గర్భిణియై శుభంబగు దినమున*

(షష్ఠాశ్వాసము, 98)

స్వరోచిని చూసి ఆ చిన్నది, "రాజా, నేను ఈ వనమునకు ఆధిపత్యం వహించే దేవతను. నీ వలన భూలోకమును రక్షించే మనువుని కనమని సర్వ దేవతలు నన్ను కోరగా, ఇచటకు వచ్చితిని. నీవు నన్ను వరించి, దాంపత్యము చేసి, కుమారుని కనుము. సర్వలోకానికి పుణ్యము కలుగును," అన్నది. స్వరోచి అంగీకరించి, ఆ వనదేవతతో సౌఖ్యము అనుభ వించెను. ఆమె గర్భము దాల్చినది.

వారి కుమారుడు స్వారోచిషుడు. అతడు పెరిగి పెద్దయినాక, తపస్సు చేయగా, శ్రీమహావిష్ణువు ప్రసన్నమై, 'నీవు ఈ భూలోకమునకు మనువుగా నీతి ధర్మములతో పరిపాలించుము' అని ఆనతి ఇచ్చెను. ఆ స్వరోచిపుత్రుడు స్వారోచిషమనువుగా, రెండవ మన్వంతరానికి ఆదిపురుషుడుగా ప్రసిద్ధి కాంచెను.

ఇంతకు ముందు చెప్పినట్లుగా ప్రబంధానికి కథైక్యము, రసప్రాదాన్యత, వర్ణన ముఖ్యము. మొదటి మూడు అశ్వాసాలు ప్రవరుడు, వరూధిని, మాయప్రవరాఖ్యుల కథ. చతుర్థ, పంచమ, షష్ఠా శ్వాసములలో స్వరోచి, స్వారోచిష్యుల కథ. ఈ ఇరువురూ వరూధినికి కొడుకు, మనుమడు అయి నప్పటికీ ఈ ఆశ్వాసాలలో వరూధిని ప్రసక్తి లేకపో వడంతో ఈ ప్రబంధము రెండు ఖండాలుగా చీలి నట్లున్నదిగాని ఏకకావ్యంగా రక్తి కట్టలేదని కొందరి వాదన.

ఆ వాదనను వ్యతిరేకిస్తూ విశ్వనాధ సత్య నారాయణగారు ఇలా వ్రాశారు. ''కావ్యములో కథైక్యము లేదనియు కొందరందురు. కథలో నైక్యము లేకపోవుట అసత్యము. అంతకంటె నితివృత్తము విస్తృతమైన దనుట కొంతవరకు నిజము. ఈ కథా విస్తృతికి కారణము వరూథినీ వృత్తాం తము, స్వరోచిచరిత్రము అనెడి రెండు స్వయం సంపూర్ణ కథలు రచించుట. మరి రెండు స్వయం సంపూర్ణ కథలు ఉంటే కథైక్యత లేనట్లేగదా, విశ్వనాధ గారూ? ఉదాహరణకు మహాభారతంలో ఎంతో విషయ విస్తృత ఉన్నది. కాని అందులో వస్తైక్యత లేదని ఎవరూ అనరు గదా!

ఇక రసప్రాదాన్యతకి వస్తే, ప్రబంధాలకు ఒక అంగి (ప్రధాన) రసం ఉంటుంది. ఇంకా కొన్ని అంగ (సహాయ) రసాలు ఉండవచ్చు. వరూధిని ప్రవరాఖ్య సంవాదము, వరూధినీమాయాప్రవరగంధర్వుల సంభోగ సన్నివేశాలు శృంగారరస శోభితములు. అట్లునే స్వరోచి తన ముగ్గురి భార్యలతో, తరువాత వనదేవతతో కలవడం అంతయూ శృంగారమయం. కాని ఆద్యములో ప్రవరుని ధర్మదీక్షానిష్ఠలు, అంతములో స్వారోచిషుని తపస్సు, మహావిష్ణువు ప్రత్యక్షము ఇవి శాంతిరసమునకు ప్రతీకలు. కావున ఆద్యంతములలోని శాంతిరసము ప్రధానమా, లేక కావ్యకథకు మూలము, కాండము అయిన శృంగారము ప్రధానమా అన్నది మీమాంస. పింగళి లక్ష్మీకాంతం, జి.వి. సుబ్రహ్మణ్యం, ముదిగంటి సుజాతారెడ్డి గారలు శాంతము అంగిరసమని భావించారు. కాని దివాకర్ల వెంకటావధాని, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, పల్లా దుర్గయ్య, బి. జయ రాములు గారలు శృంగారమే అంగిరసమని నిర్ధారిం చారు. వీరందరూ తెలుగు ప్రొఫెసర్లు, సంస్కృతాంధ్ర భాషాపారంగతులు. వారలలోనే ఇట్టి విభేదం ఉన్న దంటే, అది అల్లసాని జిగిబిగి అల్లికకు నిదర్శనం. కథామూలం శృంగారాధారం అవటంచేతనూ, గ్రంధ విశేషభాగం శృంగారభరితం కావటం చేతనూ నేను కూడా ఈ ప్రబంధానికి ప్రధాన రసం శృంగారమని భావించుచుంటిని.

అలంకారవ్యాకరణ శాస్త్రల ప్రకారం పద్దెనిమిది వర్ణనలు ఉన్నాయి. వీటిని అష్టాదశవర్ణన లంటారు. అవి నగరము, సముద్రము, ఋతువు, చంద్రో దయము, సూర్యోదయము, ఉద్యానము, రతోత్స వము, విప్రలంభము, వివాహము, పుత్రోత్పత్తి, ఇలా మొత్తం పద్దెనిమిది. ఈ ప్రబంధములో ఇటువంటి వర్ణణలు చాలామట్టుకు అన్ని రకాలు ఉన్నాయి. ఈ వ్యాసంలో మచ్చుకి ఇచ్చిన పద్యాలలో అల్లసాని వారి కవితాప్రతిభ మనకు తెలుస్తోంది. వర్ణనలకు, కల్పిక లకు అల్లసాని వారికి పెద్దన్నయే సాటి.

వరూధిని ప్రబంధనాయకిగా ఆంధ్రుల సాహిత్యచరిత్రలో ఎల్లకాలమూ నిలిచిపోతుంది. సౌందర్యమూ, శృంగారవ్యామోహం, ఆత్మ విశ్వాసమూ, అహంకారంతో మిళితమయిన చిలిపి తనం, ఆలోచనాస్పష్టత ఉన్న యువతీ. సనాతన ధర్మాచారాలకు, పూజాప్రక్రియలకూ ఫలితం ఏమిటని అడుగుతుంది, హేతువాదిలా. కాని అంతటి తెలువరి మాయాప్రవరుని చేతిలో మోస పోవడం బాధాకరంగా ఉంటుంది కొంతమంది

సాహిత్యప్రియులకు. క్షేమేంద్రుని సంస్కృత మూలంలోగాని, మారన వ్రాసిన మార్కండేయ పురాణంలో గాని అలా ఉండవచ్చును. కాని అల్లసాని ఇంకోవిధంగా వ్రాసియుండవలసినదేమో. కనీసం రాజమాతగా స్వరోచి వివాహానికి రావటంగానీ, లేక స్వారోచిషుడు మనువుగా నియమింపబడినప్పుడు నాయనమ్మగా వచ్చి ఆశీర్వదించడంగానీ జరిగితే ఎంతో మనోరంజకంగా ఉండేది, ప్రబంధానికి ఆద్యంతపు బిగువు వచ్చి ఉండేది.

ఆంధ్ర కవితా పితామహునిగా బిరుదు వహించిన అల్లసాని పెద్దన వ్రాసిన మనుచరిత్ర (అసలు పేరు స్వారోచిషమనుసంభవము) ప్రబంధసాహిత్యానికి గీటురాయి. ఇందులోని కవితాశిల్పం, వర్ణనా కౌశల్యం అద్వితీయం, అనితరసాధ్యం. ❁

*ఈ వ్యాసకర్త వర్జీనియాలో ఉంటారు. Federal Aviation Administration, Washington, DCలో Air Traffic control Automation Systems పైన సీనియర్ ఇంజనీరుగా పని చేస్తున్నారు. వీరు వ్రాసిన 'ఆంధ్ర యూనివర్సిటీ కథలు' విశాఖ సంస్కృతి సాహిత్య మాసపత్రికలో ధారావాహికంగా వచ్చాయి.*



**హంసి చుండ్రు**
*8వ తరగతి*
*విజయవాడ, ఆంధ్రప్రదేశ్*

# గుప్పెడు మిణుగురులు

మూలా సుబ్రహ్మణ్యం

ఆ తీరంలో
ఎంతటి మహాత్ముడి
అడుగుజాడలైనా
చెరిగిపోక తప్పదు

నీకు నువ్వే
ఓ దారి వెతుక్కోవాలి

జీవితమూ
సముద్రమే!

*

కలలెక్కడో అంతమవ్వాలి
మళ్లీ పుష్కరాల వేళకి
ఈ నది ఉంటుందో లేదో

ఒక్క క్షణమైనా
నిన్ను విడిచిపెట్టి
నదిలోకి...
నదిని నీలోకి...

కాలం
ఎంత అర్థరహితం!

*

మట్టిరోడ్డు పక్కన
దుమ్ములో తడుస్తూ నవ్వుతున్న
గాజుపూలు, గన్నేరు పూలు
ఏవెక్కువ అందమైనవి?

తూనికలు, కొలతలులేని
ఒకే ఒక్క చూపు

సానుభూతి అంచుల్లో సంతోషం
అభినందనల అడుగున అసూయ

ఏ రంగూ లేని
ఒక్క కన్నీటిబొట్టు
నీకూ ప్రపంచానికీ మధ్య
గీతల్ని చెరిపేస్తూ...

*

సముద్రమో, నదో అక్కరలేదు
చిన్ని నీటిచెలమ
కన్నుల్లో...

సూర్యుడో, చంద్రుడో అక్కరలేదు
గుప్పెడు మిణుగురులు
గుండెల్లో...

చాలు!



విలక్షణ కవి మూలా సుబ్రహ్మణ్యం కథలూ, నవలలూ రాశారు. అలతి పదాలతో సున్నిత భావాలని అందమైన పదచిత్రంగా మలచడం వీరి కవిత్వం ప్రత్యేకత. ఐ.ఐ.టి ఖరగ్‌పూర్‌లో ఎం.టెక్ చేసిన ఈయన ప్రస్తుతం ఐ.ఐ.టి పాలక్కడ్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు.



శ్రీ అట్లూరి జలపతి

# టాలీవుడ్ పై కరోనా పంజా

**కరోనా...** ప్రపంచం ఇంతకుముందెన్నడూ చూడని మహమ్మారి ఇది.

లాక్‌డౌన్.... తెలుగు చిత్రసీమకి గతంలో ఎప్పుడూ పరిచయం లేని క్రైసిస్.

వరదలు, తుఫాన్లు, సమ్మెలు, బంద్ లు... ఇలా ఎన్నింటినో చూసింది, తట్టుకొంది సినిమా పరిశ్రమ. కరోనా వల్ల ఏర్పడ్డ సంక్షోభం మాత్రం జీవితాలను అతలాకుతలం చేస్తోంది. మొత్తంగా సినిమా షూటింగులు ఇన్ని వారాలుగా ఆగడం, సినిమా థియేటర్లు నెలలకొద్దీ మూతపడడం ఇదే ఫస్ట్ టైం. దీని మూల్యం కూడా భారీగానే ఉంది. సినిమా పరిశ్రమపై ఆధారపడ్డ వేలాదిమంది కార్మికుల లైఫ్ బాలన్స్ తప్పింది. రిలీజ్‌కి రెడీగా పెట్టుకున్న సినిమా నిర్మాతల బ్యాంకు బాలన్స్ మైనస్‌లో పడింది. కరోనా వల్ల ఎంత కష్టమో అందరికి తెలిసింది. ఇక ఎంత నష్టం అన్న లెక్కలు తేలాలి.

## కష్టం... నష్టం

ఎంత రఫ్ ఎస్టిమేషన్ వేసినా... ఆ నష్టం 350 నుంచి 400 కోట్ల రూపాయల మేరకు ఉంటుందనేది నిజం.



తెలుగు సినిమాకి ఈ ఏడాది మార్చి 25 నుంచి వేసవి సీజన్ షురూ అవుతుంది అని భావించారు. దానికి తగ్గట్లు సినిమాల విడుదల ప్లాన్ చేశారు. ఉగాదినాడు నాని, సుధీర్ బాబు నటించిన 'వి' వస్తుందని ముందే ప్రకటించారు. శేఖర్ కమ్ముల తీస్తున్న 'లవ్ స్టోరీ'ని వేసవి చివర్లో రిలీజ్ చేసేలా అనుకున్నారు. అంటే దాదాపు 70 రోజుల లాంగ్ సీజన్లో దాదాపు 400 కోట్ల వ్యాపారం ఉండేది.

ఈ మొత్తం సీజన్ ఇప్పుడు ఆవిరైపోయింది. సినిమాలన్ని జూన్ తర్వాతో, జులై తర్వాతో థియేటర్ల బాట పట్టాలి. అప్పుడు కూడా ఇదే రేంజ్‌లో వ్యాపారం జరుగుతుంది అని చెప్పలేం. సమ్మర్‌లో రిలీజయ్యే సినిమాలకే కలెక్షన్లు ఎక్కువ. 'పోకిరి', 'బాహుబలి 2' వంటి కళ్లు చెదిరే హిట్స్ సమ్మర్‌లోనే దక్కాయి అనే విషయాన్ని మరవొద్దు. ఆ లెక్కన చూస్తే... నష్టం బాగానే ఉంటుంది. దానికి తోడు... సినిమా విడుదల

వాయిదాపడితే... పెట్టిన పెట్టుబడిపైన వడ్డీ కూడా పెరుగుతుంది. అది అదనపు ఖర్చు. 'వకీల్‌సాబ్' వంటి పెద్ద సినిమాలకైతే వడ్డీలు కూడా కోట్లల్లో ఉంటాయి.

### *నష్టాల లింక్... జనం జంకు*

సినిమాల ప్రదర్శన మొదలైన వెంటనే జనం మునుపటిలా వస్తారా అన్న సందేహాలు కూడా అలాగే ఉన్నాయి. సోషల్ డిస్టెన్స్‌కి అలవాటు పడుతున్న జనం కరోనా జంకు మనసులో పెట్టుకొని... ఎన్నాళ్ల పాటు థియేటర్‌కి డిస్టెన్స్ మెయింటైన్ చేస్తారో చెప్పలేము. ఒకసారి థియేటర్లని ఓపెన్ చేసిన తర్వాత వెనక్కి తగ్గడం ఉండదు. జనం వచ్చినా రాకున్నా థియేటర్ ఓపెన్ అవ్వాలి. దానికి ఆపరేషన్ ఖర్చు ఉంటుంది. ఒకదానికి మరోటి లింక్ అయి ఉన్న ఇండస్ట్రీ ఇది. సో... అటు సినిమాపై జరిగే వ్యాపారం, ఇటు థియేటర్లతో కూడిన రెవెన్యూ లేదా లాస్ లెక్క వేస్తే... కష్టాల కడలిలో ఈదడమే.

### *డిజిటల్ స్ట్రీమింగ్‌తో గట్టెక్కగలరా?*

ఒకప్పుడు థియేటర్ల ద్వారా ఎంత వస్తే అంతే రెవెన్యూ అన్నట్లుగా ఉండేది. ఆ తర్వాత శాటిలైట్ హక్కులు, హిందీ డబ్బింగ్ రైట్స్, మ్యూజిక్ రైట్స్...





| సినిమా | బిజినెస్ రేంజ్ |
|---|---|
| వి | 30 కోట్లు |
| ఒరేయ్ బుజ్జిగా | 6 కోట్లు |
| 30 రోజుల్లో ప్రేమించడం ఎలా | 3 కోట్లు |
| నిశ్శబ్దం | 25 కోట్లు |
| ఉప్పెన | 15 కోట్లు |
| అరణ్య (తెలుగు) | 20 కోట్లు |
| రెడ్ | 30 కోట్లు |
| మాస్టర్ (డబ్బింగ్) | 10 కోట్లు |
| శ్రీకారం | 15 కోట్లు |
| బెల్లంకొండ మూవీ | 20 కోట్లు |
| సోలో బ్రతుకు సో బెటర్ | 20 కోట్లు |
| క్రాక్ | 25 కోట్లు |
| వకీల్ సాబ్ | 150 కోట్లు |
| లవ్ స్టోరీ | 25 కోట్లు |





ఇలా చాలా అదనపు రెవెన్యూ మార్గాలు వచ్చాయి. లేటెస్ట్‌గా ‘డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్’ పెద్ద ఆదాయ వనరు అయింది. పెద్ద హీరోల సినిమాలకి థియేటర్ల ద్వారా జరిగే వ్యాపార పరిమాణానికి సమానంగా డబ్బింగ్, డిజిటల్, స్ట్రీమింగ్ రైట్స్ మారాయి. లాక్‌డౌన్ కారణంగా ఇండియాలో డిజిటల్ స్ట్రీమింగ్ సంస్థలు



లాభపడ్డాయి. సబ్ స్క్రయిబర్‌లు పెరిగారు. దాంతో... థియేటర్‌లో సినిమా విడుదల చేయకుండా మా ‘ఆప్’లోనే రిలీజ్ చేస్తే... రెగ్యులర్‌గా ఇచ్చేదానికన్నా భారీగా ఇస్తామని అవి ప్రతిపాదనలు పెట్టాయి. నాని నటించిన ‘వి’ సినిమాకి పాతిక కోట్లవరకు ఇచ్చేందుకు రెడీ అయ్యాయి. అయితే... ఈ మోడల్ చిన్న సినిమాలకి తప్ప కాస్త పేరున్న హీరో, పెద్ద హీరోల సినిమాలకి వర్ ఔట్ అవదు. అందుకే... ఎవరు పెద్దగా ఆ ప్రతిపాదనలకు టెంప్ట్ అవలేదు.

డిజిటల్ స్ట్రీమింగ్‌తో గట్టెక్కడం అనేది ఇప్పట్లో సాధ్యం కాదు.

### అన్ని వాయిదా!

సమ్మర్ సినిమాల సీజన్ ఆగిపోవడం ఒకటే సమస్య కాదు. ఈ నష్టం ఇతర రూపాల్లో కూడా ఉంటుంది. ఉదాహరణకు.. దసరా సీజన్ కూడా కంగాళీగా మారుతోంది. వేసవిలో విడుదల కావాల్సిన కొన్ని సినిమాలు ఆగస్టు, సెప్టెంబర్‌కి మారుతున్నాయి. అలాగే షూటింగ్‌లు ఆగిపోవడం వల్ల మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న ‘ఆచార్య’ సినిమా షెడ్యూల్ తారుమారు అయింది. ఆగస్టు 14న రిలీజ్ చేద్దామను కున్నారు. కానీ ఈ సినిమా ఈ ఏడాది విడుదల అవుతుందా అన్నది కూడా డౌటే. ఇది కూడా కరోనా ఎఫెక్ట్.



ప్రభాస్ నటిస్తున్న 'జాన్' సినిమా షూటింగ్ కూడా ఆగింది. ఇది ఈ అక్టోబర్‌లో రాకపోవచ్చు. కొత్త డేట్ ఎప్పుడు అనేది ఇప్పుడే చెప్పలేము. దాంతో ఈ సినిమా ఖర్చు కూడా పెరుగుతుంది. బాలకృష్ణ, బోయపాటి మూవీ పరిస్థితి కూడా అంతే. రాజమౌళి తీస్తున్న 'ఆర్ ఆర్ ఆర్' షూటింగ్ ఇంకా ఆలస్యం అయ్యేలా ఉంది. షూటింగ్‌లు వెంటనే మొదలు కాకపోతే, 'ఆర్ ఆర్ ఆర్' సంక్రాంతి బరి నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. అదే జరిగితే... టాలీవుడ్‌కి తీరని నష్టం. ఎందుకంటే... ఆ సినిమా సంక్రాంతికి వస్తుందనే ఉద్దేశంతోనే మిగతా సినిమాలు అన్ని తమ తమ రిలీజ్ డేట్స్ సెట్ చేసుకున్నాయి. అది ఒక్కటి మారితే అన్నీ మళ్లీ డేట్స్ మార్చుకోవాలి.

ఇప్పటికిప్పుడు... చిత్రసీమలో అంతా అయోమయంగా ఉంది. కరోనా మహమ్మారి దెబ్బ మామూలుగా లేదు. కొన్ని దెబ్బలు పైకి కనపడుతాయి.



పోలీసోడు కొడితే... దెబ్బ కనపడదు కానీ నొప్పి సుర్రుమంటూ ఉంటుంది. కరోనా దెబ్బ అలాగే ఉంది. దీని ఆఫ్టర్ అఫక్ట్స్ ఇప్పుడే సరిగా అంచనా వెయ్యలేము. నష్టం మాత్రం తీవ్రం.




Razberry's
Making Moments Memorable
YOUR DAY ... YOUR VISION
Weddings • Sweet 16
Social Events • Corporate Events
\Razberrys.Banquet.center
834 State Rt 12
Flemington, NJ, 08825
908-782-2379 • 908-399-9459
www.razberrys.net

# కొసరి పాటల కొసరాజు



కొసరాజు పేరు వినగానే రైతుజీవితదర్పణాలవంటి గేయాలు, తాత్త్వికగీతాలు, అజరామర హాస్యగీతాలు, ఇంకా వందలాది పల్లెటూరిపాటలు, జానపదగీతాలు, ప్రబోధగీతాలు సినీ సంగీత ప్రియులకు జ్ఞాపకానికి వస్తాయి.

కొసరాజు రాఘవయ్య గారిని తొలుత సినీరంగానికి తన 'రైతుబిడ్డ ' సినిమా ద్వారా పరిచయం చేసినవారు గూడవల్లి రామబ్రహ్మంగారు. మలిప్రవేశం, చాలా కాలానికి 'పెద్దమనుషులు ' సినిమాతో గానీ జరగలేదు.'పెద్ద మనుషులు', ఆ తర్వాత 'రాజూ పేద' పాటల విజయం, 'రోజులు మారాయి' సినిమాకు దారి తీసాయి. 'రోజులు మారాయి' అఖండ విజయంతో కొసరాజు సినీరంగంలో స్థిరపడ్డారు.

మరో మూడు దశాబ్దాలపాటు, అంటే జీవించి వున్నంతకాలం ఆయన పాటలు వ్రాసినా ప్రథమార్థంలో ప్రధానంగా 1970 ప్రాంతాలవరకూ వచ్చిన కొసరాజు పాటలకు ఉన్న విస్తృతి, వైవిధ్యం, నైగనిగ్యం ఆయనను 'జానపద కవిసార్వభౌమ' బిరుదానికి అర్హుణ్ణీ చేశాయి. ఆ పాటలలో మరికొన్నింటిని ఈ వ్యాసంలో చూద్దాం.

## ◆ శ్రీకృష్ణ పాండవీయం
## ◆ ఉమ్మడి కుటుంబం





నందమూరి తారక రామారావుగారిని 'రూప సుందరుడు' అన్నారు ఒక సందర్భంలో వేటూరి.

అందగాడిగా అసమాన కథానాయకుడిగా తెరవేల్పుగా రామారావు తేజస్సు ఆయన సినీ జీవితంలోని ఇతర పార్శ్వాలను కొంత మరుగున పడేసింది.

నేషనల్ ఆర్ట్ థియేటర్స్ సంస్థ ద్వారా తమ్ముడు త్రివిక్రమరావు నిర్మాతగా ఆయన తొలిరోజుల్లో నిర్మించి, తర్వాత రోజుల్లో దర్శకత్వం కూడా వహించి, తెరకెక్కించిన చలనచిత్రాలు మరే నిర్మాతకు, దర్శకుడికి రాశిలోనూ వైవిధ్యంలోనూ ప్రేక్షకాదరణలోనూ తీసిపోనివే.

తాను దర్శకత్వం వహించిన తొలి సినిమా 'సీతారామ కళ్యాణం' (1961)లో దశకంఠుడు కైలాసాన్ని పెకలించి, శివుని మెప్పించే సన్నివేశం, అలాగే శ్రీరామజననం సందర్భంగా వచ్చే 'గోవింద మాధవ దామోదరా' పాట చిత్రీకరించిన విధానం, దర్శకుడిగా ఆయన ప్రతిభను చాటే రెండు ఉదాహరణలు.

కొసరాజు సినీ పరిశ్రమలోకి రెండవసారి అడుగు



పెట్టి స్థిరపడిన క్రమంలో, ఆయన పాటలు వ్రాసిన రెండో సినిమా రామారావు నటించిన 'రాజు పేద' (1954) గురించి చెప్పుకున్నాం. ఇంకా రామారావు మీద చిత్రించిన 'జయం మనదే' (1956) సినిమాలోని కొసరాజు పాటలు కూడా చూశాం. కానీ రామారావు సొంత సినిమాలకు కొసరాజు పాటలు వ్రాయటం మరో పదేళ్లకుగానీ జరగలేదు.

ఆ సినిమా 'రామకృష్ణ ఎన్ఏటి కంబైన్స్' పతాకంపై స్వీయ దర్శకత్వంలో రామారావు తీసిన సంచలన పౌరాణిక చిత్రం 'శ్రీకృష్ణ పాండవీయం' (1966). రామారావు తొలిసారి పౌరాణికాల్లో ద్విపాత్రాభినయం చేయడం, జగత్ప్రఖ్యాతిగాంచిన ఆయన సుయోధన పాత్ర ప్రేక్షకులను తొలిసారి అలరించడం ఈ సినిమాతోనే జరిగాయి. తెలుగుల పుణ్యపేటి పోతన భాగవతంలోని 'రుక్మిణీ కళ్యాణ ఘట్టం' ఎంతో అందంగా రామారావు తెరకెక్కించారు ఇందులో.

శ్రీకృష్ణ పాండవీయంకు కొసరాజు వ్రాసిన 'మత్తు వదలరా...' పాట విశేషంగా ప్రాచుర్యం పొందింది.

లక్క ఇంటికి కాపలాగా ఉన్న భీముడు నిద్ర ఆపుకోలేక తూలుతూ కునుకుతూ ఉంటే, ఒక ముసలి సాధువు వేషంలో కృష్ణుడు హితబోధ చేసే కల్పిత సన్నివేశం ఇది. భారతంలో లేనిదే అయినా జనరంజకంగా ఉంటుంది.

తేలిక మాటలతో, వినగానే గుర్తుండే కొసరాజు పల్లవితో, అటు సన్నివేశానికి, ఇటు వ్యక్తి వికాసానికి సరిసమానంగా పనికొచ్చే పాట మత్తు వదలరా. సినిమాతో సంబంధం లేకుండా ఎవ్వరైనా తమకు అన్వయించుకుని స్ఫూర్తి పొందదగిన గీతం.

మొదటి చరణంలో చివరి పంక్తి 'పరమార్థం గానలేక వ్యర్థంగా చెడిపోవు' అని వ్రాసి ఉంటే ముందు లైన్ల లోని అంత్యప్రాసలతో (సరిపోవు, లేకపోవు) కలిసి అక్షర శిల్పం అందంగా అమరేది. అలా చేయకుండా చెడతాడు అనడం, అలాగే మత్తు వదలరా, వినకపోతే నీ ఖర్మ, మొదలైనవి ఒక సహజ సంభాషణను స్ఫురింపిస్తాయి.



అపాయమ్ము దాటటానికి... ఉపాయమ్ము కావాలి
అంధకారం అలిమినపుడు... వెలుతురుకై వెదకాలి
ముందు చూపు లేనివాడు... ఎందులకు కొరగాడు
సోమరియై కునుకువాడు... సూక్ష్మమ్ము గ్రహింపలేడు

మత్తు వదలరా... నిద్దుర మత్తు వదలరా
ఆ మత్తులోన పడితే... గమ్మత్తుగ... చిత్తవ్వుదువురా
మత్తు వదలరా... నిద్దుర మత్తు వదలరా

జీవితమున సగభాగం... నిద్దురకే సరిపోవు
జీవితమున సగభాగం... నిద్దురకే సరిపోవు
మిగిలిన ఆ సగభాగం... చిత్త శుద్ధి లేకపోవు

అతి నిద్రాలోలుడు... తెలివిలేని మూర్ఖుడు
అతి నిద్రాలోలుడు... తెలివిలేని మూర్ఖుడు
పరమార్థం కానలేక... వ్యర్థంగా చెడతాడు ॥మత్త॥

సాగినంత కాలం... నా అంతవాడు లేడందురు
సాగినంత కాలం... నా అంతవాడు లేడందురు
కండబలముతోటే... ఘనకార్యం సాధించలేరు
బుద్ధిబలం తోడైతే... విజయమ్ము వరింపగలరు ॥మత్తు॥

చుట్టుముట్టు ఆపదలను మట్టుబెట్టబూనుమురా-2
పిరికితనం కట్టిబెట్టి... ధైర్యము చేపట్టుమురా

కర్తవ్యం నీ వంతు... కాపాడుట నా వంతు
కర్తవ్యం నీ వంతు... కాపాడుట నా వంతు
చెప్పటమే నా ధర్మం... వినకపోతే నీ ఖర్మం ॥మత్తు॥

తొలిసారి రామారావుగారి సొంత సినిమాకు తాను వ్రాసిన ఈ పాట ఒక పెద్ద పరీక్ష అయి కూర్చుందని తన ఆత్మకథలో వ్రాసుకున్నారు కొసరాజు. పాటంతా దాదాపు అయిపోయినా చివరి రెండు లైన్లు చాలాసేపు విసిగించాయట.

బాగా పొద్దుపోయి, బుర్ర వేడెక్కిపోయి, 'ఈ పూట ఆపేసి రేపు కొనసాగిద్దామని' కొసరాజు అంటే ఎన్టీఆర్ ఒప్పుకోక, 'ఇప్పుడు రానిది రేపేమొస్తుంది? ప్రయత్నించండి,' అని చెక్కుల మీద సంతకాలు పెడుతూ కూర్చున్నారట.

చివరికి, 'ఇది ఎలా ఉంది చెప్పండి, చెప్పడమే నా ధర్మం వినకపోతే నీ ఖర్మం,' అని కొసరాజు అనగానే ఎన్టీఆర్, 'వెరీగుడ్ ఇదే నాకు కావలసింది,' అని అభినందించడమే కాకుండా తమ్ముడు త్రివిక్రమరావుకు ఫోన్ చేసి పాట చాలా బాగా వచ్చిందని, కొసరాజు మంచి పాట రాశారని సంతోషం వ్యక్తం చేశారట.

ఇక్కడ రామారావుకు అనుకున్న పని అనుకున్న సమయానికి అయిపోవాలన్న పట్టుదల, తనకు కావలసిన దాని గురించి స్పష్టమైన అంచనా ఇటువంటి విషయాలు గమనించాలి. సి. నారాయణరెడ్డి గులేబకావళి కథ పాటలు వ్రాస్తున్న అనుభవాలు గుర్తు చేసుకుంటూ ఎన్టీఆర్ గురించి ఇటువంటి విషయాలే చెప్పారు.

ఇవిగాక, పరిశ్రమలో కఠోరమైన క్రమశిక్షణకు, నిద్ర మీద పూర్తి అధికారం ఉన్నందుకు, రామారావు గారిని చెప్పుకునేవారు. ఆయనకు మత్తు వదలరా పాట ప్రత్యేకంగా తృప్తిని ఇచ్చి ఉండాలి.

2

శ్రీకృష్ణపాండవీయం చిత్రానికి కొసరాజు వ్రాసిన రెండో పాట 'భళాభళి నా బండి...'

మత్తు వదలరా పాట పరీక్ష పాస్ అయ్యాక, భళా భళి నా బండి... పాట రచన నల్లేరుపై బండి నడకలా జరిగిపోయి ఉంటుంది. ఇది బకాసురుడికి ఆహారం తీసుకువెళుతూ భీముడు పాడే పాట.

తెలుగు మహాకవులు రామాయణ భారతాలలో పాత్రలను, సన్నివేశాలను, తెలుగు వారి జీవితాలకు తగ్గట్టుగా ఎన్నో సందర్భాల్లో తీర్చిదిద్దారు. 'శాకంబరీ దేవీ ప్రసాదం, ఆంధ్రశాకం - గోంగూర' లేనిదే కౌరవ ప్రభువులు ముద్దైనా ముట్టరు అని చమత్కరించారు పింగళి మాయాబజార్ సినిమాలో. అదే పద్ధతిలో మిన



పట్టు, బొబ్బట్లు, ముద్దపప్పు, నంజుకోటానికి పచ్చడి, వగైరా బకాసురుడికోసం ఏకచక్రపురవాసులు తయారు చేసినట్టు, అవి భీమసేనుడు కడుపారా తిన్నట్టు ఈ పాట చెప్తుంది. తల్లిపట్ల, శ్రీ కృష్ణుడిపట్ల, భీముడికి వున్న గౌరవం, మన్నన కూడా ఈ పాటలో కనబడతాయి.

*ఓ..ఓ..ఓహో..*
*ఓ..ఓ..ఓ..ఓ....ఓ..ఓ..*
*ఏయ్... భళాభళి నా బండీ...*
*పరుగుతీసే బండి... పరుగుతీసే బండి*
*భళా భళి నా బండీ... పరుగుతీసే బండి*
*బండిలో తిండి జూడ... బ్రహ్మకు నోరూరునండి*
*భళాభళి నా బండీ...*
*పరుగుతీసే బండి... పరుగుతీసే బండి*
*ఎహెహెహె... ఎహెహెహె..*

*తిండి లేనిదే కండ లేదురా...*
*కండ లేనిదే గుండె రాదురా... హే తమ్ముడూ*
*తిండి లేనిదే కండ లేదురా... కండ లేనిదే గుండె రాదురా*
*గుండె దిటవుగా నున్నచో...*
*బ్రహ్మాండములోనే ఎదురు లేదురా... ఆ.. ఆ.. ఆ..*

*కరకర ఆకలి మండుతువుంటే...*
*కమ్మని భోజన మెదురుగ వుంటే*
*కరకర ఆకలి మండుతువుంటే...*
*కమ్మని భోజన మెదురుగవుంటే*
*గుటకలు మ్రింగుచు కూర్చొనువాడు...*
*ఉంటే వాడు వెర్రివాడు ॥భళా॥*

*అట్టురా మినపట్టురా... దీన్నొదిలి పెట్టేదెట్టురా*
*తీపితీపి బొబ్బట్టురా... అహ తింటే ఆకలి కట్టురా*
*పప్పుతోటి ఒక ముద్ద కలిపి... పచ్చడితో అనుపానమేసి..*
*ఓహో... పప్పుతోటి ఒక ముద్ద కలిపి...*
*పచ్చడితో అనుపానమేసి*
*బక్క పేగులకు పట్టిస్తుంటే...చెప్పశక్యమా దీనిరుచి ॥భళా॥*

*సాటిలేని జగజెట్టి భీముని చేతుల తీట తీరునులే...*
*అరి చేతుల తీట తీరునులే*
*ఏకచక్ర పురావాసుల బెడద నేటితోనే పరిమారునులే*
*తల్లి ఋణమ్మును తీర్చెద నా ధర్మమ్మును నెరవేర్చెద..*
*ఓ ఆత్మబంధూ... ఓ ఆత్మబంధూ...*
*నీ అండ ఉంటే ఎవరడ్డమైన పరిమార్చెద*

*భళాభళి నా బండీ... పరుగుతీసే బండి*
*బండిలో తిండి జూడ... మాయమైనదండీ...*
*భళాభళి నా బండీ... పరుగుతీసే బండి*
*పరుగుతీసే బండి... పరుగుతీసే బండి*




3

ఆ తర్వాత సంవత్సరం (1967) రామకృష్ణ ఎన్.ఏ.టి కంబైన్స్ వారు విజయవంతమైన సాంఘిక చిత్రం 'ఉమ్మడి కుటుంబం' అందించారు. ఎన్టీ రామారావు కథ, స్క్రీన్ ప్లే అందించగా డి. యోగానంద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు కొసరాజు మూడు పాటలు అందించారు.

వీటిలో 'లంకాదహనం' వీధినాటకం గురించి ఇంతకుముందు నవరాత్రి సినిమా పాటల ప్రస్తావనలో కొద్దిగా స్పృశించాం. ఇక్కడ పూర్తి పాఠం చూడండి.

బాల్యంలోనే అవధానాలు చేసిన ప్రౌఢకవి కొసరాజు సినిమాలో పద్యాలు అరుదుగానే రాశారు. అందులో ఒకటి రావణాసురుడు పాడే 'గడువిచ్చితి పది దినములు' పద్యం ఇందులో ఉంది.

'ఉమ్మడి కుటుంబం' సినిమాకే సముద్రాల రామానుజాచార్యులు (సముద్రాల జూనియర్) వ్రాసిన 'సతీసావిత్రి' వీధినాటకం ఎంతో ప్రాచుర్యం పొందింది.

కొసరాజు వ్రాసిన 'లంకాదహనం' సంగీత సాహిత్యపరంగా వినటానికి బాగున్నా మరీ అప హాస్యంగా చిత్రీకరించడంవల్ల అంతగా వెలుగులోకి రాలేదు అనిపిస్తుంది.

ఈ సినిమాలో 'గడుసుమిల్లివారి నాలుగో బుల్లోడు రంగమార్తాండ రాముడు' (రామారావు) నాటకాలు ఆడుతూ ఉంటాడు. అతనికి ఊర్లోని ఒక చాకలివారి జంట (రాజబాబు, వాణిశ్రీ) సహాయంగా

లంకేశుడు - సీత

ఇంతిరో నన్నెరుకకో- లంకేశుడనని తెలుసుకో
సరసాలిక మానుకో- నీ చావు మూడు తెలుసుకో

ఎందరెందరో అందగత్తెలు -కన్ను సైగలు చేసి చేసి
రారమ్మని పైనబడిన - రానుపొమ్మను దానవేంద్రుడ

పాపభీతి రవంతలేకను - పరసతిని చేపట్ట జూతువు
తప్పురా - ఇక ఇప్పుడైన అయోధ్య రాముని వేడుకో

అష్ట దిక్పతులందరును నా ఆనతిని ఊడిగము సేతురు
మానవాధముడైన రామునని గొప్పజేసి చెప్పనేల

కదనమున ఆ రామబాణము- కండలుగ నిను
చెండునప్పుడు
అష్ట దిక్పతులన్న వారెవరడ్డమౌదురో చూచెదవులే

లంకేశుడు

కII గడువిచ్చితి పది దినములు
గడబడ సేయకను నీదు కాంతునిగానన్
బడయుము - కాదన్నను నిన్
విడువను హరుడడ్డమైన - వెరవను తరుణీ

సీత

ఉంగారమా - బలే పుంగారమా!
నా సామి వ్రేలి ముద్దుటుంగారమా
రామయ్య ఎపుడు వచ్చు- రావణుని ఎపుడు గూల్చు
నా సింతలెపుడు దీర్చు - ఉంగారమా

హనుమాన్

ఎంతమాత్రము - సింతింప వలదు సీతమ్మతల్లి
దశకుంఠుడైనా - వాని తాతనైనా
పిసికి పిండిజేతు - భీతి జెందవలదు

వాయుపుత్రుడ నేనురా - రక్కసిమూక
పనిబట్టి పోతానురా హే రామచంద్రప్రభూ

శేటుకాలము వచ్చెరా - మీకు సెడ్డబుద్ధులు పుట్టెరా
తల్లి సీతను తెచ్చిన - మీ ఒళ్లు హూనం సేయవచ్చిన
IIవాయుII

గుప్పుగుప్పున పొగలు గమ్మగ
గప్పుగప్పున మంట లెగయగ హే రామచంద్రప్రభూ
లంకనంతయుగాల్చి - ఈ
లంకేశు పొగరడగింప వచ్చిన IIవయుII

ఉంటారు. పైన చెప్పిన నాటకాల్లో ముఖ్యపాత్రధారులు ఈ ముగ్గురే.

ఆ జంట కోసం కొసరాజు వ్రాసిన చాకిరేవు పాట ‘సదివినోడికన్నా ఓరన్నా మడేలోడు మిన్న…’

‘చదువు లేనివాడికన్నా చాకలివాడు నయం’ అన్న పాతసామెత తిరగేసి పల్లవి వ్రాశారు కొసరాజు. కులాలకీ మతాలకీ చాకిరేవు అతీతం అన్న విషయం, తాము ఆధారపడ్డ కుటుంబాల క్షేమాన్ని కోరుకునే మంచి మనసు రజకులలో ఉంటుంది అన్న సత్యం పల్లెల్లో ఉన్న వారికి తెలిసిన విషయాలే.

**4**

భారతంలోని భీముడి మీద చిత్రించిన బండి పాట ఇందాక చూశాం.

మోటుతనంలో ఆ భీముడికి తీసిపోని గడుసు మిల్లి రాముడు మోటార్ కారు (కారులోని కథా నాయికతో సహా) తోస్తూ పాడే కొసరాజు పాట

సదివినోడికన్న ఓరన్నా మడేలన్న మిన్న
పెద్దలు సెప్పిన మాట - ఇది సద్దికూటిమూటే ఎంక్యా

ఏటికి అద్దరి ఇద్దరి ఒకటే కులాలు మతాలు అన్నీ ఒకటే
రేవునబెట్టి వుతికేటప్పుడు ముతకాసన్నం అంతా ఒకటే

మంచి ఒక్కటే మారకుంటది- మాటొకటే కలకాల
ముంటది
పెట్టే యిల్లు సల్లగుండమని- మా కులమొకటే
కోరుకుంటది





తస్సాదియ్యా-తస్సాదియ్యా-తమాషైన బండి
సాగితేనె బండి-యహ-సాగకపోతే మొండి ॥తస్సా॥

తుర్రుమని దుమ్మురేపు దూకుడెగానని
భంభం అని శెవులు పగులు కూతలెగాని-దీని సిగదరగ
శీల కాస్త జారెనంటె గాలి కాస్త తుస్సుమంటె-హేబుల్లా
ఉన్నచోటె వుంటాది-కదలను పొమ్మంటాది ॥తస్సా॥

కాలినడక నేర్వనోళ్ల కర్మమింతేనూ-కర్మమింతేనూ
జంటలేని ఒంటరోళ్ల తిప్పలింతేనూ-తిప్పలింతేనూ
నమ్మరాని పైనమిది-ఇనప ముక్కల జీవమిది
డబ్బెంతో పోసికొన్న అబ్బాదీని జబ్బే యిది ॥తస్సా॥

‘తస్సాదియ్యా తస్సాదియ్యా తమాషైన బండి…’

సరదాగా, వినోదప్రధానంగా ఉండే ఈ పాట, ఈ సినిమాకు కొసరాజు వ్రాసిన మూడు పాటల్లో ఎక్కువగా జనాల్లోకి వెళ్లింది. ఇది రామారావుకు కూడా బాగా నచ్చిన పాట అనుకోవాలి. ఘంటసాలతో జోడీగా ఆయన కూడా హుషారుగా గొంతు కలిపి ఈ గీతానికి అదనపు ఆకర్షణను కలిగించారు.

ఈ ఇద్దరు గళవేల్పుల కంఠాలు దేనికదే ప్రత్యేకమైనవి. అయినా ఇద్దరి శృతి సరిగ్గా సరిపోయి ఒక్కరే పాడారా అన్న భ్రమ కలగజేయటం గమనార్హం. ఘంటసాల (బాలులాగా) తన గొంతు మార్చక పోయినా రామారావుకు అంత విజయవంతంగా దశాబ్దాల పాటు పాడటానికి ఈ శృతి సామరస్యం ఒక ముఖ్య కారణంగా నేను భావిస్తాను.



ఎందుకీ తొందర సుందరాకార - నీ
ముందే నేనున్నానురా నా సామి
నీ యందే మనసున్నాదిరా
కొసరికొసరి నాతో సరసమాడెదవేల
మావారు చూచిన మాటవచ్చును చాల
తగిన సమయము చూచి - తప్పక తలుపు
తీసెద ఆగవోయీ
కరువుదీరగ బిగ్గకౌగిట - గారవించెద నమ్మవోయీ
॥ఎందుకీ॥

మందార గంధమిదే - బుగ్గపై పూసెదరా
అత్తరూ పన్నీరూ - మోజుదీర చిలికెదరా ॥మం॥
నిన్న రాతిరి గంటు - చెదరక నిలిచెనురా
చెంతకూ చేరదీసి - ముద్దు తీర్చుకోవేరా ॥మం॥

చూడు ఓయమ్మా గడుసు గుంటడూ
కన్ను గొడతావెందుకూ ॥చూడు॥
రాజవీధిని దారిగాచీ - రమ్మనంటాడెందుకూ
ఎన్ని చెప్పిన పైటచెంగూ - వదలనంటాడెందుకూ
॥చూడు॥

5

వచ్చేసారి రామకృష్ణ ఎన్.ఏ.టి కంబైన్స్ వారి తదుపరి కానుక, మరో సాంఘిక చిత్రం 'వరకట్నం' (1969) విశేషాలు చూద్దాం. అందాకా అందులోని మొదటి పాట, కొసరాజు వ్రాసిన అరుదైన మేజువాణి పాట 'ఎందుకీ తొందర సుందరాకార...' చూడండి.

పెళ్లిలో విడిదింట వియ్యాలవారికి మర్యాదలలో భాగంగా పెట్టే ఈ మేజువాణిలో ఒక్కొక్క ఆటవెలది వచ్చి, ఆడి పాడుతుంది. ఆడియన్స్ ఆత్రం వల్ల, కేకల వల్ల, క్రమంగా పాట, దాంతోపాటు సాహిత్యం ముతక బారటం గమనించవచ్చు. (ఈ ప్రవర్తన ఈనాటికీ వినోదకార్యక్రమాల్లో కనబడుతూనే ఉంటుంది)

వందేళ్ల క్రితం పెళ్లిళ్లలో బోగంమేళాలు ఎలా ఉండేవో, చివరికి ఆట, పాట చూసే ఓపికలేని జనం కోసం ఆ సానులు మోళీ కట్టటం (చూడకపోతే యుట్యూబ్‌లో ఈ సీన్ చూసితీరాలి) మొదలైనవి ఎంతో సహజంగా చిత్రీకరించారు దర్శకుడు రామారావు.

(సశేషం)

# లాక్‌డౌన్

## దేవిప్రియ



పిల్లాపాపలతో ఊళ్లకి తిరిగిపోతున్న
కూలినాలి జనం ఒంటి నుంచి
గాలిలో కలిసి వస్తున్న చెమట ఘాటు
నా మార్నింగ్ కాఫీకి ఏదో తెలియని
దుఃఖవాసన కలుపుతోంది

దీపాలు వెలిగించడం
బాల్కనీలలో బారులు తీరడం
మసీదులలో మూకుమ్మడి ప్రార్థనలు చేయడం
గుంపుగా వెళ్లి దేవుళ్లకి పెళ్లిళ్లు జరిపించడం
తండోపతండాలుగా వీధుల్లో ఊరేగడం
ఏమి యుద్ధమో ఎవరి మీద ఆగ్రహమో
ఇదేమి లాక్‌డౌన్ ఆత్మరక్షణమో
ఇదేమి స్వసంతాన భక్షణమో;
ఇంకెన్ని వేకువలు చూస్తానో నేను
ఇంకెన్ని ఊపిరులు పీలుస్తానో నేను.

వేకువన తలుపు తెరిచేసరికి
గుమ్మంలో ఎండుటాకులతోపాటు
కొన్ని నక్షత్రాలు కూడా గుమ్మం ముందు
రాలిపడి వున్నాయి

మనీప్లాంట్ తీగలలో చిక్కుకుపోయిన
వేసవి రాత్రుల చల్లగాలి విడిపించుకోడానికి
పెద్ద పెద్ద ఆకుల మధ్య పెనుగులాడుతోంది

అంత దూరాన రహదారి మీద



*కవిగా, పాత్రికేయుడిగా, సంపాదకుడిగా, సినీ గేయ రచయితగా, డాక్యుమెంటరీ రూపకర్తగా, టీవీ ఛానెల్ కంటెంట్ విభాగాధిపతిగా పేరుగాంచిన దేవీప్రియ చదువుకునే రోజుల్లోనే కవిత్వం పట్ల ఆకర్షితుడై పద్యాలు, గేయాలు రాయడం ప్రారంభించారు. పత్రికల్లో ఫ్రీలాన్సర్‌గా ప్రారంభమైన ఆయన ప్రస్థానం పత్రికా సంపాదకుని వరకు సాగింది. 'రన్నింగ్ కామెంటరీ' కార్టూన్ కవిత్వం ద్వారా తెలుగు పత్రికారంగంలో ఆయన కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. పన్నెండుకు పైగా పుస్తకాలు రాశారు. దేవీప్రియ రచించిన 'గాలిరంగు' పద్యకావ్యానికి 2017లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.*

UNDAVALLI
CONSTRUCTIONS

# PAY 10% NOW

# 0% INTEREST TILL POSSESSION

**668 LUXURY APARTMENTS**

2 ~~Bhk~~, 3 Bhk, 4 Bhk & 4 Bhk Duplex from
1200 SFT – 4160 SFT LUXURY FLATS

APRERA APPROVED



## JUST A FEW MINUTES DRIVE FROM VIJAYAWADA AND AP SECRETARIAT

Club House / Swimming Pool / Kids Pool / Multi-Purpose Function Hall / Mini Theatre
Amphitheatre / Cafeteria / Well Equipped Gymnasium / Aerobics / Meditation Hall / Jogging Track
Yoga Room / Health Spa / Children's Play Area / Outdoor Cricket Court / Basket Ball Court
Badminton Court / Shuttle Court / Elder Parks / Squash Court / Table Tennis / World Class Sports









Design By CREATIVE ETHICS.COM +919032932953(INDIA)

SRIVALLI
PRAVAS
*Your Heaven on Earth*

# LETS YOUR DREAMS COME TRUE

## on VJA - GNT National Highway at KAZA TOLL PLAZA

Bank Loans Available

+1 314 256 9132 (USA) 88 99 11 8888 (INDIA) sales@ucpl.io www.ucpl.io